# ఆలయాల్లో చోరీ.. ముగ్గురి అరెస్ట్



నిందితులనుంచి స్వాధీనం చేసుకున్న పంచలోహ, అల్యూమినియం, సిల్వర్ విగ్రహాలు

## నిందితుల నుంచి రూ.5,36,300 లక్షల విలువైన విగ్రహాల స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్‌బాబు

మన్సురాబాద్, జూలై 2: సీసీటీవీ నిఘా లేని గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల్లో పంచలోహం, అల్యూమినియం, సిల్వర్ విగ్రహాలను చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలతో పాటు వారికి సహకరించిన మరొకరిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ఓ పాత నేరస్తుడు ఉన్నాడు. ఎల్బీనగర్‌లోని రాచకొండ కమిషనరేట్ పరిధి సీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. కర్నూల్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉండే కరచ శివానంద (52) ప్రస్తుతం వనస్థలిపురం, ఎన్జీవోస్ కాలనీలో ఉంటున్నాడు. శివానంద పాత నేరస్తుడు. కాజీపేట, మీర్పేట, నాగోల్ పోలీస్ స్టేషన్లో పరిధిలో ఐదు దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా శివానందలో ఎలాంటి మార్పు రాలేదు. ప్రకాశం జిల్లా, బల్లికురవ మండలం, వల్లపల్లికి చెందిన ఎస్.కె.హామ్ షరీఫ్(38) ప్రస్తుతం ఎల్బీనగర్ లేబర్ అడ్డాల్లో నివసిస్తూ కూలీ పనిచేస్తున్నాడు. శివానందతో షరీఫ్‌కు పరిచయం ఏర్పడింది. మద్యానికి బానిసలుగా మారిన ఇద్దరికీ డబ్బులు అవసరం కావడంతో దొంగతనాలు చేసేందుకు పథకం వేసుకున్నారు. శివారు ప్రాంతాల్లో సీసీటీవీ లేని ఆలయాల్లో చోరీలకు పాల్పడాలని శివానంద పథకం వేశాడు. ఇద్దరు కలిసి ఆటోను కిరాయికి తీసుకుని ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల పరిధిలో నాలుగు ఆలయాల్లో చోరీలు చేశారు. గత నెల 24న ఉప్పల్ మెట్రో వద్ద బైకును అపహరించారు. అదే బైకుపై తిరుగుతూ ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్మెట్ ప్రాంతాల్లోని దండు మైలారం, పోల్కంపల్లిలో రెండు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. పలు పంచలోహ విగ్రహాలతో పాటు వస్తువులను దొంగలించారు. విషయంపై ఇబ్రహీంపట్నం, యాచారం పోలీస్ స్టేషన్లో పరిధిలో కేసు కట్టి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం మంగళపల్లి క్రాస్‌రోడ్ వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అటువైపుగా బైక్‌పై వచ్చిన శివానంద, షరీఫ్ అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా చోరీ విషయం బయట పడింది. పంచలోహ, అల్యూమినియం, సిల్వర్ విగ్రహాలను శివానంద, షరీఫ్ నుంచి కొనుగోలు చేసిన ఉప్పల్, భరత్‌నగర్‌కాలనీలో నివాసముంటు శివకుమార్ ఎంటర్ప్రైజెస్ పేరుతో షాప్ నడుపుతున్న అక్కపల్లి క్రాంతికుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 5,36,300 లక్షల విలువైన విగ్రహాలతో పాటు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరు దొంగతనాలకు పాల్పడినట్లు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీపీ సూచించారు.

# అంతర్రాష్ట్ర పాత నేరస్తులు అరెస్ట్

- 121కేజీల దేవుళ్ళ ఆభరణాలు, విగ్రహాలు స్వాధీనం
- రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు



**నవతెలంగాణ -హయత్‌నగర్**

దేవాలయాలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్రానికి చెందిన పాత నేరస్తులను ఇబ్రహీంపట్నం పోలీసులు, మహేశ్వరం సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు బుధవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌లో ఉన్న యాచారం, ఇబ్రహీంపట్నం, ఉప్పరగూడ, గ్రామాల పరిధిలో ఉన్న ఆలయాల్లో దేవుని పంచ లోహ విగ్రహాలను గత మూడు, నెలలుగా వరుసగా అపహరణకు గురవుతున్నాయని ఫిర్యాదు వచ్చాయని తెలిపారు. వరుసగా ఆలయాల్లో విగ్రహాలు చోరి కావడంతో సీరియస్‌గా తీసుకొని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి లోని మంగళపల్లి క్రాస్ రోడ్ వద్ద బుధవారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. పోలీసులు ఆ ఇద్దరిని విచారించగా నేరం ఒప్పుకున్నారని వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లాకు చెందిన కరచ శివానంద.. ఇతను ప్రస్తుతం వనస్థలిపురంలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్.కె హం షరీఫ్.. ఇతను ప్రస్తుతం ఎల్బీనగర్ లేబర్ అడ్డా వద్ద నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ పాత నేరస్తులు కావడం, మద్యానికి బానిసై గ్రామాలలో భద్రత లేని దేవాలయాల వద్ద పగటిపూట రెక్కి నిర్వహించేవారని చెప్పారు. ఆలయాల్లో ఉన్న పంచలోహ విగ్రహాలను అపహరించి, వాటి అమ్మకం ద్వారా వచ్చే డబ్బులతో మద్యం సేవించి జల్సాలు చేసేవారని చెప్పారు. అంతేకాదు ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్కు చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని అపహరించి..ఆలయాల్లో విగ్రహాలను దొంగిలించి.. వాటిని ఉప్పల్‌కు చెందిన అక్కపల్లి క్రాంతి కుమార్‌కు విక్రయించి సొమ్ము చేసుకునే వారని వివరించారు. నిందితుల వద్ద నుండి 121 కేజీల విలువగల విగ్రహాలు, ఒక ద్విచక్ర వాహనం మొత్తం వాటి విలువ రూ.5,36,300 ఉంటుందని అంచనా వేశారు. వారితోపాటు విగ్రహాలు కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. శివానంద్ పై పాత కేసులు 5 ఉన్నాయని, వారిద్దరి అరెస్ట్‌తో రాచకొండలో మొత్తం 7కేసులు ఛేదించినట్లు సీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, ఇబ్రహీం పట్నం ఏసీపీ రాజు, ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, విజయ్, ఎస్ఐ చందర్ సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి : సీపీ**

ఆలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీల నివారణ తగ్గడానికి ఆస్కారం ఉంటుంది. నిందితులు సీసీ కెమెరాలు ఉన్న ఆలయాల్లో చోరీలు చేయడం లేదు. పల్లెటూర్లలో ఉండే భద్రత లేని ఆలయాలను ఎంచుకొని చోరీలు చేస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.



# నైవేద్యం పెట్టిన ఆలయానికి కన్నం

- పగటిపూట వరుస చోరీలు
- అరెస్టు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ఆలయాల్లో దేవుడికి నైవేద్యం పెడుతున్నట్లు నటిస్తూ చోరీలకు పాల్పడుతున్న ముఠా ఎల్బీనగర్ సీసీఎస్, ఇబ్రహీంపట్నం పోలీసులకు చిక్కింది. నగర శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేని వాటిల్లో పగటి వేళల్లోనే దొంగతనాలు చేస్తున్నారు. ఇద్దరితో పాటు, విగ్రహాలు కొనుగోలు చేసిన మరొకరిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.5.36 లక్షల విలువైన 12 పంచలోహ, వెండి విగ్రహాలు, గుడి గంటలు, దీపం స్టాండ్లు, రెండు హుండీలు, పుస్తెలతాడు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్లు మహేందర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, డీసీపీలు సునీతారెడ్డి, అరవింద్‌బాబుతో కలిసి రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం ఎల్బీనగర్‌లో కేసు వివరాలు వెల్లడించారు.





మాట్లాడుతున్న కమిషనర్ సుధీర్‌బాబు.. స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

**వరుస చోరీలు..** ఏపీలోని కర్నూలుకు చెందిన కె.శివానంద(52), ప్రకాశం జిల్లా బల్లికురువ మండలం వల్లపల్లికి చెందిన ఎస్‌కే షరీఫ్(38) ఉపాధి కోసం నగరానికి వచ్చారు. ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో ఉంటూ కూలీలుగా పనిచేస్తున్నారు. లేబర్ అడ్డా దగ్గర ఉన్నప్పుడు ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. మద్యం అలవాటు ఉన్న వీరు డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆలయాల్లో విగ్రహాలు చోరీ చేసి విక్రయిస్తే ఎక్కువ సొమ్ము వస్తుందని శివానంద చెప్పాడు. యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని గ్రామాల్లో సీసీ కెమెరాలు, తక్కువ రద్దీ ఉండే ఆలయాలను ఆటోలో తిరుగుతూ రెక్కీ చేశారు. ప్రార్థించినట్లు, నైవేద్యం పెడుతున్నట్లు నటిస్తూ గమనించేవారు. ఫిబ్రవరిలో యాచారంలోని గండ్లగూడలో మల్లికార్జున స్వామి, శివాలయాల్లో నాలుగు గుడి గంటలు దొంగిలించారు. జూన్ 15న ఇబ్రహీంపట్నంలోని ఉప్పరగూడలో మల్లన్నస్వామి ఆలయంలో పుస్తెలతాడు, రెండు దీపం స్టాండ్లు చోరీ చేశారు.

**ఒకేరోజు రెండు చోట్లా...**

జూన్ 29న ఒకేరోజు సద్దుపల్లిలోని హనుమాన్, దండుమైలారంలో అయ్యప్పస్వామి ఆలయాల్లో చోరీలు చేశారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం దుంపలపల్లికి చెందిన అక్కపల్లి క్రాంతికుమార్ దగ్గరకు వెళ్లి రూ.18,500లకు విగ్రహాలు అమ్మేశారు. జూన్ 30న ఇబ్రహీంపట్నంలోని పొల్కంపల్లిలోని శివగంగ, హనుమాన్ ఆలయాల్లో చోరీలు చేశారు.

# విగ్రహాల దొంగల ముఠా అరెస్ట్

## రూ. 5.36 లక్షల విలువైన విగ్రహాలు స్వాధీనం

నాగోలు: దేవాలయాల్లో దేవుడి విగ్రహాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాతో పాటు చోరీ చేసిన విగ్రహాలను కొనుగోలు చేసిన వ్యక్తిని ఇబ్రహీంపట్నం పోలీసులు, ఎల్‌బీనగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 5.36 లక్షల విలువైన విగ్రహాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు..కర్నూలుకు చెందిన కరచా శివానంద పాత నేరస్తుడు. కొన్నాళ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చిన అతను వనస్థలిపురం ఎన్‌జీవో కాలనీలో ఉంటున్నాడు. ఎల్‌బీనగర్ లేబర్ అడ్డాలో తిరుగుతూ చిన్న చిన్న పనులు చేసుకునే వాడు. ఈ క్రమంలో అతడికి ప్రకాశం జిల్లా, బల్లికురువ మండలం, వల్లపల్లి గ్రామానికి చెందిన షేక్ హామ్ షరీఫ్‌తో పరిచయం ఏర్పడింది. డబ్బులు అవసరం కావడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో శివానంద దేవాలయాల్లో విగ్రహాల చోరీకి పథకం రూపొందించాడు. చోరీ అనంతరం తప్పించుకునేందుకు వాహనం అవసరమని భావించిన వారు ఆటో అద్దెకు తీసుకుని ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని గ్రామాల్లో దేవాలయాలపై రెక్కీ నిర్వహించారు. ఆ తర్వాత పథకం ప్రకారం ఫిబ్రవరి 27న యాచారం మండలం



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు..



పోలీసుల అదుపులో నిందితులు

, గండ్లగూడ మల్లికార్జున స్వామి ఆలయంలో నాలుగు గుడి గంటలను ఎత్తుకెళ్లారు. జూన్ 15 ఉప్పరగూడ గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయంలో అమ్మవారి పుస్తెలతాడు, 2 దీపం స్టాండ్‌లను చోరీ చేశారు. గత నెల 24న ఉప్పల్‌లోని మెట్రో వద్ద పార్క్ చేసిన బైక్‌ను చోరీ చేసిన వారు దానిపై తిరుగుతూ ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసరాల్లోని జన సంచారం లేని దేవాలయాలను పరిశీలించారు. గత నెల 29 సద్దుపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలోని శ్రీరాముడు, సీత, లక్ష్మణ పంచలోహ విగ్రహాలను చోరీ చేశారు. దుండుమైలారం అయ్యప్ప స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలను, అయ్యప్ప వెండి విగ్రహం, ఇతర పూజా వస్తువులను చోరీ చేశారు. చోరీ చేసిన వస్తువులను ఉప్పల్, భరత్‌నగర్‌లో ఉన్న స్క్రాప్ వ్యాపారి అక్కపల్లి క్రాంతికుమార్‌కు రూ. 18,500 వేలకు విక్రయించారు. ఈ గత నెల 30న పోల్కంపల్లి గ్రామంలోని శివగంగ దేవాలయంలోని పెద్ద రాజు, పెద్దమ్మ విగ్రహాలను చోరీ చేశారు. బుధవారం బైక్‌పై వెళుతున్న వారిని మంగల్‌పల్లి చౌరస్తా వద్ద ఎల్‌బీనగర్ సీసీఎస్ పోలీసులు, ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో క్రాంతికుమార్ నుంచి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న విగ్రహాల విలువ రూ. 5, 36 లక్షలు ఉంటుందని సీపీ తెలిపారు. శివానందపై గతంలో పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విగ్రహాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని సీపీ పేర్కొన్నారు. దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ చందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.